# సంఘటన

- పి.వి.శేషారత్నం

రక్తం...బొట్లు బొట్లుగా...

రక్తం ధార...ధారగా

చిక్కని ఎర్రని రక్తం... కత్తెర నుంచి కారుతోంది ఏకధారగా.

కాత్యాయని కళ్లు తిరిగిపోయాయి.

కెవ్వున కేకవేసింది.

నానిగాడు హడలిపోయాడు.

నాలుగేళ్ల నాని చేతిలోని కత్తెర కింద పడేసాడు.

కానీ కళ్లల్లో ఓ క్షణం మాత్రమే కనిపించిన బెదురు మాయమై ఆ స్థానంలో ఎర్రని కోపం ప్రజ్వరిల్లింది.

కాత్యాయనికి ఓ క్షణం అది కలో నిజమో అర్థం కాలేదు.

నానిగాడేమిటి? హత్య చేయడమేమిటి? కాస్త అల్లరి వాడయితే కావచ్చు.

తరచూ ఇరుగుపొరుగు పిల్లల్ని కొడుతూ వాళ్లేడుస్తుంటే కేరింతలు కొడుతూ ఆనందిస్తే ఆనందించి వుండవచ్చు.

కానీ ఇదేమిటి?

ఏకంగా హత్య...అదీ తన తల్లిని.. కన్నతల్లిని.

అమాయకురాలైన అమ్మమ్మని పొడిచేయడమేమిటి?

తల్లి శాంతమ్మ స్పృహ తప్పి పడివుందో, చచ్చిపోయిందో ఓ క్షణం అర్థంకాలేదు కాత్యాయనికి.

తన భర్త ఏడాదిపాటు ఢిల్లీలో ట్రైనింగ్‌కి వెళ్లాడు.

తనకి సాయం కోసం నాన్నగారు అమ్మను పంపారు.

అమ్మమ్మ మనవడూ బాగానే దోస్తులయ్యారు.

వాళ్ల అన్యోన్యత చూసి తనకి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయింది.

నానిగాడు సాధారణంగా ఎవరితోనూ కలవడు. ఎప్పుడూ తననే అంటిపెట్టుకుని ఉండాలనే అనుకుంటాడు.

వాడి తండ్రి ఇక్కడ వుంటే కూడా తిప్పుకునేవాడు.

కానీ సెంట్రల్ సర్వీసెస్‌కి సెలెక్టయ్యాడు. శిక్షణ తప్పనిసరిగా ఏడాదిన్నర.

తన ఉద్యోగం మూలాన తనకీ వాడితో ఎక్కువసేపు గడిపేందుకు వీలుండడంలేదు.

అలాంటిది తన తల్లితో నాని ఇట్టే కలసిపోయేసరికి ఎంతో హాయయనిపించింది తనకు.

అమ్మకి మోకాళ్ల నొప్పులు. కూర్చుంటే లేవలేదు. అయినా తనకి తోడుకోసం వచ్చింది పాపం.

అమ్మమ్మకి ప్లేటులో పెట్టిన టిఫిన్ అందించడం, చిన్ని చేతులతో నోట్లో ఇడ్లీ తినిపించడం, పలమారితే మంచినీళ్ల గ్లాసు ఇవ్వడం అలవాటైన వాడిలా చేసేస్తున్న నానిగాడిని చూసి అమ్మమ్మకి కూడా ఎంతో ముచ్చటేసింది.

'నీ కొడుకు బంగారు కొండే. అదృష్టవంతురాలివమ్మా' అని నాలుగురోజులు కూడా కాలేదు.

వాడు ఈమధ్యనే చేరిన చిట్టి స్కూలుకి సెలవులిచ్చేసి వారంరోజులయింది.

ఇంక అమ్మమ్మే వాడి లోకం అయిపోయింది.

ఓపిక లేకపోయినా వాడికి రాజుగారు బంగారు చేప కథలు, రాక్షసులు దేవకన్యల కథలు, ఏనుగు చిట్టెలుక కథలు కొసరి కొసరి చెప్తుంటే పెద్ద కళ్లని చక్రాల్లా తిప్పుతూ ఆసక్తిగా వింటూ బుల్లి మెదడులో వచ్చే సందేహాలతో అమ్మమ్మని విసిగిస్తూ ఉండేవాడు.

అలాంటిది ఇవాళ ఇంత ఘోరం ఎలా చేసాడు?

నాన్నగారికేమని చెప్పాలి?

అసలీ మధ్య నాలుగురోజుల నుండి నానిగాడిలో దౌర్జన్యం పెరిగిపోయింది.

తనే పట్టించుకోలేదు.

పంచదార పలుకులు చేజారితే వాటిని మోసుకుంటూ లైనుగా వెళ్తున్న చీమలను సగానికి నలిపేసి నవ్వడం, ఈగలని చంపడం, టీవీలో హింస నేపథ్యంలో వచ్చే సినిమాలు చూడడం... కళ్లు మూయకుండా అదేపనిగా సినిమాలు చూసేవాడిని డిస్టర్బ్ చేస్తే ఎంత కోపమో వాడికి...

హఠాత్తుగా తన కేకకి చుట్టుపక్కల నలుగురూ పరుగెత్తుకొచ్చారు.

రక్తపు మడుగులో వున్న శాంతమ్మని ఆస్పత్రికి తీసుకుపోయారు.

ఇరుగూ పొరుగూ తల్లులు గుసగుసలాడుతూ నానిగాడిని అసహ్యంగా, కోపంగా చూడడం కాత్యాయని మనసును నరకం చేసింది.

"వేలెడంత లేడు... ఎంత పనిచేసాడో?"

"ముసలమ్మ బ్రతుకుతుందో లేదో?"

"మొన్న మా చంటాడిని చావగొట్టాడు"

"నిన్న మా పిల్లని రక్తం వచ్చేలా కరిచేసాడు"

"అయినా ఒక్క పిల్లవాడిని అదుపులో పెట్టుకోకపోతే ఇరుగూపొరుగూ బ్రతకాలా వద్దా? చూడండి గుడ్లు మిటకరించి ఎలా చూస్తున్నాడో? పోలీసుల్ని పిలవండి"

వాళ్లామాట అనకముందే ఎవరో అప్పుడే పోలీసులకి సమాచారం ఇచ్చినట్టున్నారు.

బూట్ల చప్పుడు, బొంగురు గొంతులు...

కాత్యాయనికి కళ్లెదుట అంత తంతు జరుగుతున్నా ఏదో లోకంలో వున్నట్టే వుంది.

అప్పటికే తన చేత వీపు వాచిపోయేలా దెబ్బలు తిని ఏడుస్తూ కన్నీళ్ళు బుగ్గల మీదుగా చారికలు కట్టిన నానిగాడిని బలవంతంగా పోలీసులు పట్టుకుపోవడం, కాత్యాయనికి స్పృహ తప్పడం ఒకేసారి జరిగాయి.

***

"ఎవరది?"

కాత్యాయని భయంగా చూసింది ఆ యువకుడివైపు.

అతనికి ఇరవై ఏళ్లుంటాయి. కళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి నిప్పులు కురిపిస్తున్నట్లు.

"నన్ను గుర్తుపట్టలేదు కదూ.. నాని..."

వికటంగా నవ్వాడు.

తన నానిగాడు జైల్లో పెరిగి ఇంత పెద్దవాడయ్యాడా? కళ్లల్లో ఆ కోపం ఏమిటి? చేతిలో పిస్టల్...

"నన్ను చిన్నప్పుడే జైల్లో పెట్టించి నా జీవితమంతా బోస్టన్ స్కూల్‌లో నరకం అనుభవించేలా చేస్తావా? నువ్వసలు కన్నతల్లివేనా? ఒక్కనాడయినా బ్రతికానో, చచ్చానో చూడ్డానికి వచ్చావా? తెలిసీ తెలియని వయసులో నేను చేసిన నేరానికి తల్లివై వుండి నువ్వే సాక్ష్యమిచ్చి నన్ను హంతకుడిగా ముద్రవేస్తావా? నువ్వు బ్రతికి వుంటే మానవత్వానికే మచ్చ, కన్నతల్లులకే అవమానం...చావు..." కసిగా పిస్టల్ పేల్చాడు నానిగాడు.

కెవ్వున అరిచింది కాత్యాయని.

భర్త శ్రీనివాస్ ఆమెను పొదవి పట్టుకున్నాడు.

"కాత్యా! లే మంచినీళ్ళు తాగు. పీడకల వచ్చిందా?"

"కలా? కాదు... నానిగాడు నన్ను చంపేస్తున్నాడు. పిస్టల్ పేల్చాడు"

"చాల్లే వూరుకో. నీ పలవరింతలతో నిన్న రాత్రంతా నిద్రలేదు నాకు. ఇప్పుడు పగలు కూడా పలవరింతలేనా?"

"పలవరింతలా? నానిగాడు నిజంగానే వచ్చాడు. కోపంగా వున్నాడు"

"పిచ్చి కాత్యాయనీ! నువ్వింకా ఈ లోకంలోకి రాలేదు. ఆ రోజు ఫోన్‌లో నీ ఆర్తనాదాలు విని నేను ఉన్నఫళంగా అధికారులకు మొర పెట్టుకుని రెక్కలు కట్టుకుని వాలాను. ఇటు చూడు ఏమంత ఘోరం జరిగిపోలేదు. నువ్వు కాస్త తేరుకుని మాట్లాడు"

"అయితే నానిగాడు..."


"నానిగాడికేం ఫర్వాలేదు. నువ్వేం వర్రీకాకు. ఇదిగో నీ ఫ్రెండు సుజాత నుండి ఇందాక నీకు లెటర్ వచ్చింది. చిన్నపిల్లల మనస్తత్వాన్నెంత చక్కగా ఎనలైజ్ చేస్తూ వ్రాసిందో?"

"ఏది సుజీ ఇంత తొందరగా లెటర్ వ్రాసిందా?"

అవును. తన ప్రాణ స్నేహితురాలికి జరిగిందంతా పూస గుచ్చినట్లు వ్రాసిందిగా ఆ రోజు రాత్రే.

ఆ రోజు తను ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికి రావడం, నానిగాడు సరిగా సమాధానం చెప్పకపోవడం, వాడు పేచీ పెట్టడం, అన్నం కంచం వాడు విసిరేయడం, ఇల్లంతా అన్నం చిమ్మబడేసరికి అసలే తలనొప్పి, అలసటగా వున్న తనకి సహనం పోవడం, తను నాలుగు తిట్టేలోగానే తన తల్లి ముద్దుగా నానిగాడిని మందలిస్తూ చిన్న దెబ్బ వేయడం, అంతే వాడు రెచ్చిపోయి పక్కనే మిషను కత్తెరని తన తల్లిమీదకు విసిరేయడం... ఆవిడ 'అమ్మో' అంటూ పడిపోవడం, నేలంతా రక్తమయం కావడం, నానిగాడ్ని ఆ కోపంతో నాలుగు చరిచేసరికి వాడూ బిత్తరపోయి పెద్ద పెట్టున ఏడ్వడం, అందరూ వచ్చి ఆ గందరగోళం...

తన భర్తకి ఫోన్ చేసి నానిగాడిని ఇక్కడ్నుంచి తీసుకెళ్లకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం, అత్తగారికి ఫోన్ చేసి ఆవిడను నిష్టూరమాడడం, తండ్రికి ఫోన్ చేసి భోరుమని ఏడ్వడం... ఇంత జరుగుతున్నా నానిగాడు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం... ఇటీవల సెలవులిచ్చిన దగ్గర్నుంచీ పట్టుకోలేకపోతున్న వాడి అల్లరి,





## ప్రణాళిక

అందాల నటి షమితాషెట్టి ఇప్పుడు మంచి సినిమాలో నటించేందుకు తన టైం అంతా కేటాయిస్తోంది. 'మంచి కథలు వింటూ నా ఖాళీటైం అంతా వినియోగిస్తున్నాను. సినిమాలు లేక ఖాళీగా ఉండేకంటే ఇలా మన టాలెంట్‌కి తగ్గ పాత్రల కోసం ట్రై చేస్తున్నాను. మ్యూజిక్ వింటూ, ఇంటర్నెట్ ఛాటింగ్ చేస్తూ ఆనందంగా లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాను' అని తన వ్యాపకం గురించి చెబుతోంది షమితా. త్వరలో వచ్చే అవకాశాలని బట్టి ఆమె ఈ వ్యాపకం ఎంత ప్రయోజనకరమయినదో తెలుస్తుంది.

టీవీ అద్దం పగలగొట్టడం, పక్క పిల్లల్ని ఏడిపించడం... వాడు హంతకుడయిపోతాడేమోనన్న తన భయం, ఆందోళన, వాడి హింసాత్మక ధోరణి, తన మనసు పడుతున్న క్షోభ... అన్నీ విపులంగా రాసింది సుజీకి.

చిన్నప్పట్నుంచీ అది తన సమస్యలెన్నింటికో పరిష్కారం చెప్పేది.

తను కొండంతలుగా ఊహించుకునే వాటిని గోరంతలుగా తేల్చి పారేసేది.

తన పెళ్లి విషయంలో కూడా తను ఎటూ తేల్చుకోలేకపోతుంటే శ్రీనివాస్ గుణగణాలన్నీ ప్లస్ పాయింట్స్‌గా విడమరచి అతన్నే చేసుకోవాలని చిటికెలో తేల్చి చెప్పింది సుజాతే.

కాత్యాయని కన్నీళ్లతో సుజాత ఉత్తరం విప్పింది.

"డియర్ పిచ్చీ!

నువ్వు నిజంగా పిచ్చిదానివేనే కాత్యా! లేకపోతే ఏదో పసివాడు ఉప్పులో పప్పులా చేసిన చిన్నపనికి ఇంత రాద్ధాంతంగా మనసు పాడు చేసుకుంటావా?

నానిగాడిని ఈమధ్యనే స్కూల్లో వేసావుకదా. వాళ్ల నాన్న దగ్గర్లో లేడు, నువ్వా ఆఫీసుకు పోతావు. కొత్త స్కూల్లో వాడికి వాడి వయసు పిల్లల్తో అలవాటు అయ్యేసరికి సెలవులొచ్చేసాయి. మీ అమ్మగారితో, నీతోకంటే స్కూల్లో వాడి నేస్తాలతో కాలక్షేపమే వాడికెంతో ఊరట.

అలాంటిది సెలవులొచ్చేసరికి వాడికెటూ తోచి ఉండదు. పైగా అల్లరి చేయవద్దంటూ అస్తమానం నీ అదిలింపులు. ఒక్క పక్క వాళ్ల నాన్న గారాబం, ముద్దూ దూరమైంది. వాడికి తిక్కతిక్కగా వుంది. నాలుగేళ్ల పసివాడికి నీ ఆఫీసు, అలసట, గోల ఏం తెలుస్తుంది?

పగలంతా అమ్మమ్మతో ఆటలాడి, పోట్లాడి నువ్వొచ్చేసరికి ఆనందంగా గడపాలనుకున్నాడు. నువ్వు విదిలించేసరికి తిక్క పెరిగింది. పైగా అమ్మగారు, నువ్వూ ఒకటై వాడి చిన్నారి మనసును రెచ్చగొట్టారు.




పసివాడు తిక్క కోపంలో విసిరాడు తప్ప నువ్వు ఊహించిన్న దౌర్జన్యం, హింస, ప్రకోపం అందులో లేవు.

ఏదో కాకతాళీయంగా జరిగినదానికి నువ్వు సర్దుకుని వాడిని లాలించాల్సిందిపోయి కొడతావా? వాడి పసి మనసు ఎంత గాయపడుతుంది?

వాడికి ఆడుకోవడానికి ఓ చెల్లినైనా ఇచ్చావు కాదు, తప్పు నీదే. నీ ఊహాగానాలు మాని నీ ఆఫీసు దగ్గరే వున్న క్రెష్‌లో వదిలెయ్ వాడిని. మధ్యలో వీలు చూసుకుని లంచ్ అవర్‌లో పలకరించు.

పిల్ల నేస్తాలతో హాయిగా ఎంచక్కా తనివితీరా ఆటలాడి అలసిపోయి ఇంటికి రాగానే కాస్త తిని బజ్జుంటాడు. నాలుగు రోజులు మీ ఆయన్ని రమ్మను. వాడికి కాస్త ఊరట. మీ అమ్మగారు ఈపాటికి తేరుకుని ఉంటారనుకుంటాను. లేనిపోనివన్నీ ఊహించుకుని మనసు పాడుచేసుకోకు"

**- నీ సుజీ**

ప్రసన్నమైన ఆమె ముఖం వంకె దీక్షగా చూస్తున్న శ్రీనివాస్ "కాత్యా! నీకో తమాషా చూపించనా?" అన్నాడు.

"ఏమిటి?"

"అదిగో ఆ రూంలో చూడు. అమ్మమ్మ మనవళ్ల అనుబంధం సినిమా ఆడుతోంది. తల్లి రూంలోకి చూసిన కాత్యాయని కడుపు నిండిపోయినట్టయింది.

కళ్లల్లో నీరు తిరిగింది.

నానిగాడు అమ్మమ్మ పొట్టమీద కూర్చుని ఆమె తలకున్న తెల్లని కట్టుపై చిన్ని చేతులతో రాస్తూ ఉఫ్‌మని ఊదుతున్నాడు.

"అమ్మమ్మ ఆయొచ్చిందా పాపం. పోతుందిలే. ఎవరు కొట్టారమ్మమ్మా..." అంటూ తనకేసి చూపించుకుంటూ "ఈ నానిగాడేగా. వీడిని కొట్టు" అంటూ అమ్మమ్మ చేత్తో తన పొట్టమీద కొట్టించుకుంటున్నాడు. ఆమె నోట్లో ద్రాక్షపండు పెడుతున్నాడు.

నీరసంగా వున్నా మనవడి ప్రేమకి మురిసిపోతూ వాడి చిన్న పొట్టను ముద్దాడుతోంది తల్లి శాంతమ్మ.

"నా బంగారు తండ్రే! నీకెంత ప్రేమరా అమ్మమ్మంటే నా నాయనే! మీ అమ్మకి చేతులెలా వచ్చాయిరా నిన్ను కొట్టడానికి... పసివాడనేనా చూడకుండా కొట్టింది" అంటూ తన చేతి గాజు గీరుకుపోయిన వాడి చిన్న వీపును ప్రేమగా రాస్తోంది తల్లి.

ఆ దృశ్యం ఎంత అపురూపంగా వుందో కాత్యాయనికి.

ఆమె భయాలన్నీ పటాపంచలై తెలి మబ్బులు తేలియాడుతున్న ఆకాశంలా వుంది మనసు.

"నా కొడుకుని హంతకుడంటావా? ఉండు నీ పని చెప్తా" అంటున్న భర్తకు అందకుండా పరుగెత్తింది కాత్యాయని ముసిముసిగా నవ్వుతూ.

★